క్లుప్తంగా

వైఎస్సార్ బీమా చెక్కు అందజేత



బాధిత కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా చెక్కును అందజేస్తున్న దృశ్యం

పాలకొల్లు అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన వైఎస్సార్ బీమా పథకం కుటుంబంలో పెద్ద దిక్కు కోల్పోయిన కుటుంబానికి ఆసరాగా వైఎస్సార్ నిలుస్తుందని సర్పంచ్ గంటా సత్యనారాయణ చెప్పారు. మండలంలోని వాలమర్రు గ్రామ సచివాలయంలో ఇటీవల ప్రమాదవశాత్తు మరణించిన వేండ్ర మల్లన్న కుటుంబానికి వైఎస్సార్ బీమా కింద మంజూరైన రూ.4.90 లక్షలు చెక్కును మల్లన్న కుటుంబ సభ్యులకు శుక్రవారం సర్పంచ్ సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మధుబాబు, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ సెక్రటరీ తుండూరి దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

డ్రెయిన్ల నిర్మాణాలకు రూ.20 లక్షల మంజూరు

పెనుగొండ: ఎన్నో ఏళ్లుగా ఉన్న మురుగు సమస్య పరిష్కారానికి మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు రూ.20 లక్షల మంజూరు చేశారని ఆచంట ఏఎంసీ చైర్‌పర్సన్ చిల్లే లావణ్య తెలిపారు. శుక్రవారం వల్లూరు ఇందిరమ్మ కాలనీలో ఏఈ రమేష్‌తో కలిసి పర్యటించారు. గడపగడపకు మన ప్రభుత్వంలో ఆయా ప్రాంతాల కాలనీ వాసులు సమస్యను ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకు వచ్చారన్నారు. దీనికి స్పందించి నిధులు మంజూరు చేశారన్నారు. త్వరలోనే సమస్యకు మోక్షం కలుగుతుందని ఆనందం వ్యక్తం చేశారు.

నేడు లోక్ అదాలత్

పాలకొల్లు సెంట్రల్: కేసులు వాదించుకుంటే ఒక్కరే గెలుస్తారని అదే సమస్యను పరిష్కరించుకుంటే ఇద్దరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పవన్ కుమార్ తెలిపారు. శుక్రవారం కోర్టు హాలులో న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీన స్థానిక కోర్టు ఆవరణలో లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుండి లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ వేదాల నాగరాజు, ఏపీపీ జయసిందు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా ప్రతిష్టాత్మకం

పెనుగొండ: రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రాను ప్రతిష్టాత్మకంగా నిర్వహించడానికి అన్ని రకాల చర్యలు తీసుకొందని పెనుగొండ ఎంపీడీఓ ఎస్. శ్రీనివాస్ దొర అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఆడుదాం ఆంధ్రా శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లోని మట్టిలో మాణిక్యాలను వెలికి తీయడమే లక్ష్యంగా యువతను ప్రోత్సహించడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ ఎన్.ఏడుకొండలు, ఈఓపీఆర్డీ సీహెచ్ ఎస్.వెంకట రెడ్డి, విద్యాశాఖాధికారులు డి.శుభాకరరావు, పి.రామకృష్ణ పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి

పెనుగొండ: విద్యార్థులు భాష, రాత నైపుణ్యంతో పాటు ప్రతి అంశాన్ని ఆసక్తిగా వినడం అలవర్చుకోవడంతో నైపుణ్యం పెంచుకోవాలని ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాల పాలక వర్గ సెక్రటరీ కరస్పాండెంట్ డాక్టర్ కె.రామచంద్రరాజు అన్నారు. శుక్రవారం కళాశాల ఆవరణలో పీజీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు మాట్లాడుతూ క్రమశిక్షణ పాటిస్తూ విలువలతో కూడిన విద్యనభ్యసించాలన్నారు. కార్యక్రమంలో ఎంసీఏ విభాగాధిపతి డాక్టర్ సీహెచ్ శ్రీనివాస్, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ కె.చిరంజీవి, డాక్టర్ ఐ.సాయి ప్రసాద్, కె.విశ్వనాథరాజు, రత్నరాజు పాల్గొన్నారు.

ఘనంగా స్త్రీల దినోత్సవం



మొగల్తూరు పంచాయతీ ఇంజేటివారిపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

మొగల్తూరు: స్త్రీలు అన్ని రంగాలతో పాటు బైబిల్ నందు కూడా పూర్తి పరిజ్ఞానం కలిగిఉండాలని పేరిస్ పాస్టర్-2 రెవరెండ్ తలారి కందయ్య మోజెష్ కోరారు.శుక్రవారం మొగల్తూరు పంచాయతీ ఇంజేటివారిపాలెంలోని లూథరన్ చర్చిలో స్త్రీల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్.దీప్తి సుధీర్ మాట్లాడుతూ స్త్రీలు పరిజ్ఞానంతో తమ కుటుంబాలను ఉన్నత స్థితికి తీసుకువచ్చేలా కృషి చేయాలన్నారు. అనంతరం గోదావారిపేట, పాలకమ్మచెరువు,కొండావారిపాలెం, రాజుగారితోటకు చెందిన స్త్రీలు గ్రామంలో ఐక్య ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డెలిగేట్స్ బొడ్డుపల్లి సుబ్బారావు, కోనాల ప్రసాద్, సీఆర్ పిట్టా చార్లెస్, విల్లూరి లాజర్, కొండా శేఖర్, ఇంజేటి సాల్మన్ రాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వై ఏపీ నీడ్స్ జగన్



యలమంచిలి: కాంబొట్లపాలెంలో ప్రగతి నివేదికను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు



పాలకొల్లు అర్బన్: ఉల్లంపర్రులో ప్రగతి నివేదికను ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు

యలమంచిలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగున్నరేళ్ల పాలనలో మీకు, మీ కుటుంబానికి న్యాయం జరిగిందని భావిస్తేనే వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) కోరారు. కాంబొట్లపాలెం గ్రామంలోని సచివాలయం వద్ద శుక్రవారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న ప్రతి కుటుంబానికి జగనన్న పాలనలో న్యాయం జరిగిందన్నారు. ఎలాంటి సిఫారసులకు, లంచాలకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా పథకాలు అమలు చేసిన జగనన్నకు ప్రజలంతా బాసటగా నిలవాలని గోపి కోరారు. ముందుగా కాంబొట్లపాలెం గ్రామంలో ఈ నాలుగున్నరేళ్లలో ప్రత్యక్ష నగదు బదిలీలో 25 పథకాల ద్వారా రూ.10.57 కోట్లు, పరోక్ష నగదు బదిలీలో మరొక 8 పథకాల ద్వారా రూ.4.02 కోట్లు, గ్రామాభివృద్ధికి రూ.2.48 కోట్లు వెరసి మొత్తం రూ.17.07 కోట్లు ఖర్చు చేసినట్లు వివరిస్తూ సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన బోర్డులను గోపి ప్రారంభించారు. అనంతరం సచివాలయం వద్ద వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు యడ్ల తాతాజీ, ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి, సర్పంచ్ అనిశెట్టి మల్లిక, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శీలం వీరబాబు, ఎంపీటీసీ కంబాల సత్యశ్రీ, వ్యవసాయ సలహా మండలి యలమంచిలి మండల చైర్మన్ బొంతు వెంకట కర్ణారెడ్డి, నాయకులు మంద హరికుమార్, అనిశెట్టి ధర్మారావు, అంతర్వేది సీతారామయ్య, బండి శ్రీను, వేండ్ర సుబ్బారావు, అనిశెట్టి గంగన్న తదితరులు పాల్గొన్నారు.

జగన్ ఉంటేనే సంక్షేమం, అభివృద్ధి

పాలకొల్లు అర్బన్ : ఏపీలో సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఉంటేనే ప్రజలకు సంక్షేమం, అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందుతాయని జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు చెప్పారు. పాలకొల్లు మండలం ఉల్లంపర్రులో శుక్రవారం జరిగిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో ప్రత్యక్ష ప్రయోజనాలుగా రూ.14,83,84,652, పరోక్ష ప్రయోజనాలుగా రూ.8,04,28,832, అలాగే అభివృద్ధి పనుల నిమిత్తం రూ.2,36,29,000, వెరసి మొత్తంగా రూ.25,24,42,488 ప్రయోజనం పొందారని గోవిందరాజులనాయుడు వివరించారు. ముందుగా సచివాలయ ఆవరణలో వైఎస్సార్ సీపీ పతాకాన్ని ఆవిష్కరించారు. నోడల్ అధికారి కె మాణిక్య వైభవతి, పంచాయతీ కార్యదర్శి డీఎస్ పద్మాజీరావు, గ్రామ మాజీ సర్పంచ్ పెదపాటి హవీలా, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు రావాడ సతీష్, గ్రామ పార్టీ నాయకులు అల్లు శ్రీనివాసరావు, కాటంరెడ్డి రామారావు, మిడతాని సీతామహలక్ష్మి, పార్టీ మండల కన్వీనర్ విప్పర్తి ప్రభాకరరావు, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కుంచిలపల్లి వినిస్టన్‌బాబు, జేసీఎస్ జిల్లా కన్వీనర్ ఖండవల్లి వాసు, జేసీఎస్ పట్టణ, మండల కన్వీనర్లు ఎంఎస్ వాసు, పార్శి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

వెలగలేరులో

పెనుమంట్ర: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో మాజీ మంత్రి ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు కృషి ఫలితంగా వెలగలేరు గ్రామంలో రూ.16.19 కోట్ల ఖర్చుతో వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అభివృద్ధి పనులను పూర్తి చేసినట్లు వెలగలేరు సర్పంచ్ కొవ్వూరి మధువాణి అన్నారు. శుక్రవారం గ్రామ సచివాలయం వద్ద వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ చిన్న గ్రామాన్ని ఇంత పెద్ద మొత్తంతో అభివృద్ధి చేసిన ఘనత చెరుకువాడ శ్రీరంగనాథరాజుకే దక్కుతుందని, ఆయనను తిరిగి గెలిపించుకోవడం ద్వారా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి సీఎం చేసేందుకు గ్రామస్తులంతా చిత్తశుద్ధితో పని చేయాలని ఆమె కోరారు. ఈ సందర్భంగా సచివాలయం వద్ద ఏర్పాటు చేసిన సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జెండాను గ్రామ కమిటీ అధ్యక్షుడు కర్రి సురేష్‌రెడ్డి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు గూడూరి దేవేంద్రుడు, విద్యుమౌలిక వసతుల కార్పొరేషన్ డైరెక్టర్ కొవ్వూరి వేణుమాధవరెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ కొవ్వూరి చిన్నారెడ్డి, మార్టేరు ఎంపీటీసీ సభ్యురాలు కర్రి అనురాధా జోగిరెడ్డి, సొసైటీ డైరెక్టర్ చెల్లూరి ఆదిమూర్తి, పడాల నాగిరెడ్డి, నేదూరి జీవ పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



గుంపర్రులో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి)

యలమంచిలి: రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) చెప్పారు. గుంపర్రు గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించి మిచాంగ్ తుపానువల్ల దెబ్బతిన్న వరి చేలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ ప్రభుత్వం మీకు అన్ని విధాలా అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. తుపాను వల్ల దెబ్బతిన్న రైతులందరికీ ప్రభుత్వం నష్ట పరిహారం అందించడంతోపాటు, తడచిన, మొలకెత్తిన ధాన్యాన్ని కొనడానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలిచ్చారన్నారు. ధాన్యం తరలించడానికి అవసరమైన గోని సంచులు, వాహనాలు సిద్ధం చేసినట్లు ఆయన వివరించారు. ఆయన వెంట దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ పరిశీలకులు యడ్ల తాతాజీ, ఎంపీపీ రావూరి వెంకటరమణ బుజ్జి, గుంపర్రు, కాంభొట్లపాలెం, చింతదిబ్బ సర్పంచ్‌లు తుంగ అమూల్య, అనిశెట్టి మల్లిక, చిలుకూరి సూనావతి ఎంపీటీసీ సభ్యురాలు కంబాల సత్యశ్రీ, వ్యవసాయ సలహా మండలి యలమంచిలి మండల చైర్మన్ బొంతు వెంకట కర్ణారెడ్డి, నాయకులు వీరా ఉమాశంకర్, పితాని శ్రీనివాస్, జడ్డు బదరీ నారాయణ, గణపాబత్తుల ఏసుబాబు పాల్గొన్నారు.

క్రీడలను ప్రోత్సహించడమే లక్ష్యం



ఆడుదాం ఆంధ్ర కిట్స్ పంపిణీ చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం: ఆడుదాం ఆంధ్ర పేరుతో రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించే బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శుక్రవారం ముదునూరి తన క్యాపు కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. పట్టణంలోని 1,2 వార్డులకు సంబంధించిన యువకులకు ఆడుదాం..ఆంధ్రా కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముదునూరి మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి 50 రోజుల పాటు గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ జరిగే ఈ క్రీడా సంబరాలు ప్రత్యేకమైనవన్నారు. గతంలో యువక్రాడాకారులను ప్రోత్సహించే ఇలాంటి కార్యక్రమం రాష్ట్రంలో జరగలేదన్నారు. యువతకు అవసరమైన క్రీడా సామగ్రిని ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కౌన్సిలర్ సోమరాజు దుర్గాభవానీ, కావలి నాని, గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బూసరపు జయ పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణ కార్తీక వనసమారాధన



సంఘీయులను అభినందిస్తున్న సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు ఉప్పలపు పెద్దిరాజు

పాలకొల్లు అర్బన్: నాయీబ్రాహ్మణ సంఘీయుల పిల్లలు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ, సామాజికంగా అభివృద్ధి చెందాలని జిల్లా నాయీబ్రాహ్మణ సంఘ గౌరవాధ్యక్షుడు ఉప్పలపు పెద్దిరాజు కోరారు. పట్టణ నాయీబ్రాహ్మణ కార్తీక వన సమారాధన శుక్రవారం సంఘ నూతన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఉసిరి చెట్టుకి సంఘ మహిళలు పూజలు చేశారు. ఈ సందర్భంగా రూ.20 లక్షలతో నిర్మించిన సంఘ కార్యాలయ భవనాన్ని ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ప్రారంభించి సంఘీయులను అభినందించారు. సంఘానికి చెందిన ఆర్కెస్ట్రా గాయకులు పూర్ణిమ, మధు, శేషు, రాకేష్ సుమధుర గీతాలను ఆలపించి సంఘీయులను అలరించారు. నాయీబ్రాహ్మణ ఉద్యోగ సంఘ నాయకులు ర్యాలీ విష్ణుమూర్తి, కంతేటి అన్నవరం, దిగమర్తి కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొని సంఘీయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు తమిరి నాగేశ్వరరావు, తమిరి వెంకటేశ్వరరావు, కొండేటి నాగబాబు, ఉప్పలపు పురుషోత్తం, పెదపెంకి కృష్ణ, గండేటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం



కేశవస్వామి ఆలయంలో జరుగుతున్న కార్తీక దీపోత్సవంలో చక్ర ఆకారంలో వెలిగించిన దీపాలు

యలమంచిలి: స్థానిక కేశవస్వామి ఆలయంలో నిత్య కార్తీక మాస దీపోత్సవం ఘనంగా జరుగుతుంది. శివ, కేశవులకు అత్యంత ప్రీతికరమైన మాసం కావడంతో ఆలయంలో కేశవస్వామి మండపం ఎదురుగా కృతిమ శివలింగాన్ని ప్రతిష్టించారు. ప్రతి రోజు ఆలయ ఆవరణలో శంకు, చక్ర, నామాలను వేసి వాటి చుట్టూ దీపాలను వెలిగిస్తున్నారు. శివ, కేశవుల దర్శనం, దీపోత్సవం ఒకే ప్రాంగణంలో జరుగుతుండడంతో భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి దేవేరులను దర్శించుకుని దీపోత్సవంలో భాగస్వాములవుతున్నారు. ఉత్సవాలలో భాగంగా శనివారం ఆలయం వద్ద భక్తుల సహకారంతో అఖండ అన్న సమారాధన ఏర్పాటు చేసినట్లు ఆలయ అర్చకులు వాడపల్లి గోపాలకృష్ణమాచార్యులు (గోపి) తెలిపారు. గోపి బ్రహ్మత్వంలో జరుగుతున్న ఈ దీపోత్సవాన్ని ఆలయ కమిటీ చైర్మన్ కౌరు రామ వెంకట సత్యనారాయణ, కార్యనిర్వహణాధికారి ఎస్.సతీష్ కుమార్‌లు పర్యవేక్షిస్తున్నారు.

అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం



భవిత పాఠశాలలో దివ్యాంగుల దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పాలకొల్లు సెంట్రల్: రాజకీయ, సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక పరంగా దివ్యాంగుల ఎదుగుదలను ప్రోత్సహించేలా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహిస్తున్నామని ని మండల విద్యాశాఖాధికారి గుమ్మళ్ల వీరాస్వామి తెలిపారు. శుక్రవారం స్థానిక రేపాక వారి మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో భవిత స్కూల్ నందు నిర్వహించిన అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారులు గుమ్మళ్ల వీరాస్వామితో పాటు ఆర్ఎస్‌వీఎస్‌జీ గంగాదరశర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈవోలు ఇద్దరు మాట్లాడుతూ సమాజంలో వికలాంగులు సమస్యలను పరిష్కరించేలా సాధారణ జనజీవనంలో అన్ని హక్కులు పొందేలా చూడడం కోసం ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన ఆటల పోటీల్లో విజేతలకు బహుమతులను అందజేశారు. స్థానిక విజయల్యాబ్ అధినేత కొమ్ముల మురళీకృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ సెక్రటరీ రాయపూడి భవానీప్రసాద్, పాఠశాల హెచ్ఎం మీరా మున్నీసా, ఐఈఆర్టీ ఉపాధ్యాయులు వి.టి శ్రీనివాసరావు, గాయత్రి, సిఆర్పీలు కలగ శ్రీనివాసరావు, రాజేశ్వరి పాల్గొన్నారు.

మొగల్తూరులో..

మొగల్తూరు: దివ్యాంగులు ప్రభుత్వం ఏర్పాటు భవిత కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ వర్ధమాన రవిశంకర్ సర్కార్ కోరారు. ఈ నెల 3వ తేదిన నిర్వహించాల్సిన దివ్యాంగుల దినోత్సవాన్ని తుపాను కారణంగా శుక్రవారం కుక్కలవారితోటలోని భవిత కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన దివ్యాంగ బాలలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో భవిత స్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్‌వీవీ లింగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఎం.శ్రీనివాస్, ఐఈఆర్‌టి ఎం.గంగాధరరావు, ఫిజియోథెరపీ వైద్యుడు జి.ఆమోస్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వైద్యం అందించడమే లక్ష్యం

పెనుగొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ పేదవాడికి వైద్యం అందించాలన్న లక్ష్యంతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారని, అయితే, కొందరు నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని ఆచంట మండల సర్పంచ్‌ల చాంబర్ అధ్యక్షుడు సుంకర సీతారామ్ అన్నారు. శుక్రవారం కొడమంచిలి -02లో నిర్వహించాల్సిన వైద్య శిబిరం కొడమంచిలి -01లో నిర్వహించడంపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. వల్లూరు పీహెచ్‌సీ వైద్యుని అడిగితే సరైన సమాదానం చెప్పకుండా నిర్లక్ష్యం వహించారన్నారు. దీంతో పాటు క్యాంపు జరుగుతుండగానే వదిలేసి వెళ్లపోయారని, ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలి

మొగల్తూరు: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సర్పంచ్ పడవల మేరీ సూచించారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర సమావేశంలో ఆమె వివిధ అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో పులపర్తి వెంకటేశ్వరరావు, కవురు శ్రీనివాస్, పడవల సత్యనారాయణ, తిరుమాని స్వామి, దొంగ రామారావు,పులపర్తి రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన



ఆచంట రామేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం



దుర్గాలక్ష్మణేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలో పూజలు చేస్తున్న భక్తులు

పెనుగొండ: ఆచంటలోని శ్రీరామేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం లక్ష బిల్వార్చన అత్యంత వైభవంగా నిర్వహించారు. పరిసర ప్రాంత శెట్టిబలిజ సంఘాల ఆధ్వర్యంలోనూ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు సన్నిధిరాజు వీరభద్రరావు, ప్రధాన అర్చకులు, వేద పండితులు నిట్టల సూర్యనారాయణలతో కలసి లక్ష బిల్వార్చన నిర్వహించారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు పెచ్చెట్టి శ్రీ రామచంద్రమూర్తి, కుడిపూడి శ్రీనివాస్, కుక్కల సత్యనారాయణ, కేతా ముత్యాలరావు పాల్గొన్నారు.

పెనుగొండ వాసవీ శాంతి ధాంలో

కార్తీకమాసం సందర్భంగా అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ ట్రస్ట్ ఆధ్వర్యంలోని పెనుగొండ వాసవీ శాంతి ధాంలో శుక్రవారం వాసవీ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెలంగాణాలోని హైదరాబాద్ పరిసర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులు హోమంలో పాల్గొన్నారు. అనంతరం మరకత శిల వాసవీ మాతకు అభిషేకలు నిర్వహించారు.

లక్ష్మణేశ్వరంలో

నరసాపురం రూరల్: కార్తీక మాస ఏకాదశిని పురస్కరించుకుని మండలంలోని లక్షణేశ్వరం గ్రామంలో ఉన్న దుర్గాలక్ష్మణేశ్వర స్వామి వారి ఆలయంలో శుక్రవారం లక్ష బిల్వపత్ర పూజ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు మంచిలి దుర్గాప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు వేద పండితులు శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. తొలుత గణపతిపూజ, మహన్యాసపూజ, రుద్రాభిషేకం, పత్రిపూజ, రుద్ర పూర్ణాహుతి, కుంకుమ పూజలను నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ కంకటాల పెద్దిరాజు, ఈఓ చాగంటి సురేష్‌నాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు



పెనుగొండ: భీమలాపురంలో ఉపాధి కూలీలతో కాలువ ప్రక్షాళన చేయిస్తున్న దృశ్యం



పేరుపాలెం సౌత్‌లో నిలిచిపోయిన వర్షం నీటిని మోటార్ల ద్వారా పంటబోదెలోకి తోడిస్తున్న సర్పంచ్ నర్సింహమూర్తి

పెనుగొండ: మిచాంగ్ తుపాన్ భీభత్సంతో ఆచంట, పెనుగొండ మండలాల్లో కొన్ని గ్రామాల్లో వరిచేలు మూడు రోజులుగా నీట మునిగి ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం అతి పెద్ద మురుగు డ్రెయిన్ నక్కల డ్రెయిన్‌లో గుర్రపు డెక్క పెరిగిపోవడంతో ముంపు నీరు ముందుకు పారకపోవడంతో వరిచేల్లోనే నీరు నిలిచి పోయిందంటూ పలువురు రైతులు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు దృష్టికి తీసుకు రావడంతో గురువారం నుంచే ప్రక్షాళనకు శ్రీకారం చుట్టారు. గురువారం తాడేరు డ్రెయిన్‌లో గుర్రపు డెక్కను తొలగించారు ఇంకా పెనుగొండ మండలంలో చిలక్కొడు, మట్టకోడు వంటి డ్రెయిన్లలోని వర్షపు నీరు ఇంకా నిండుగా నిలిచి ఉండడంతో శుక్రవారం ఉదయం నుంచి తూర్పుపాలెంలోని కార్యాలయం నుంచి అధికారులతో సమీక్ష నిర్వహించారు. నక్కల డ్రెయిన్‌లో నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న గుర్రపు డెక్కను సత్వరం తొలగించాలంటూ ఆదేశాలు జారీచేశారు. అధికారులతో పాటు పార్టీ నాయకులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు నిత్య పర్యవేక్షణ చేయాలంటూ సూచించారు. దీంతో ఆచంట వేమవరం వద్ద, కోడమంచిలి, భీమలాపురం, పెనుమంచిలి వద్ద పార్టీ నాయకులు, సర్పంచ్‌లు సుంకర సీతారాం, జక్కంశెట్టి గణేషుల శేషువేణి,చంటి, మొల్లేటి రామకృష్ణ, గణేషుల సుబ్బారావులు ఆయా ప్రాంతాల్లో ఉపాధి కూలీలతో కాలువల్లో అడ్డంకులు తొలగించడం, నక్కల డ్రెయిన్‌లో గుర్రపుడెక్క తొలగింపు పనులు అధికార్లుతో కలసి పర్యవేక్షణ చేసారు. దీంతో పాటు యలమంచిలి మండలం లక్ష్మీ పాలెం స్లూయిస్ వద్ద గుర్రపు డెక్క నిండిపోయిందంటూ రైతులు తెలపడంతో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు అధికారులతో సమీక్షించి గుర్రపు డెక్క తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. అధికారులు సత్వరం స్పందించి గుర్రపుడెక్కను తొలగించారు. దీంతో చేలమధ్యలో ఉన్న చిన్నపాటి మురుగు డ్రెయిన్లు, తాడేరు. చిలక్కోడు, మట్టకోడు వంటి వాటితో పాటు, నక్కల డ్రెయిన్‌లో ప్రవాహం చురుగ్గా ముందుకు సాగుతుంది. దీంతో నీట మునిగిన చేలు బయటపడవచ్చునని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తూ మాజీ మంత్రి శ్రీరంగనాథరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

వేగంగా సహాయక చర్యలు

మొగల్తూరు: ఇటీవల కురిసిన వర్షాలకు తీరప్రాంతమైన పేరుపాలెం సౌత్‌లో నీరు నిలిచిపోవడంతో స్థానికులు ఇబ్బందులుపడుతున్నారు. గ్రామంలోని పల్లపు ప్రాంతాలు నీట మునిగిపోవడంతో స్థానికులు నడిచి వెళ్లేందుకు కూడా దారి లేకపోవడంతో గ్రామస్తులు తోటల్లోకి వెళ్లలేకపోతున్నారు. దీంతో సర్పంచ్ తిరుమాని నర్సింహమూర్తి శుక్రవారం మోటార్లను ఏర్పాటుచేసి పల్లపు ప్రాంతాలలోని నీటిని పంటబోదెల్లోకి తోడేలా ఏర్పాట్లు చేయడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకుంటున్నారు. మరో రెండు రోజులపాటు పూర్తి స్థాయిలో నీటిని తోడేలా ఏర్పాట్లు చేశామని సర్పంచ్ నర్సింహమూర్తి తెలిపారు.

ఫ్రైడే డ్రై డే

పాలకొల్లు అర్బన్: ఇంటి పరిసరాల్లో మురుగు నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి కె.రాజ్‌కుమార్ కోరారు. డ్రై డే సందర్భంగా శుక్రవారం లంకలకోడేరు శివారు వెదుళ్లపాలెంలో ప్రజలకు అవగాహన కల్పించారు.